విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి



వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: ఆధునిక సమాజంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని ఓయు ప్రొఫెసర్ బి.శ్రీగణేష్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో అరోరా కాలేజ్ (నాంపల్లి, పంజగుట్ట) శాఖలకు చెందిన పీజీ విద్యార్థుల 'ఆత్మీయ సమ్మేళనం అలాప్'పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అంతులేని జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచుతుందన్నారు. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ..ఆరోగ్యకరమైన జీవితం విజయం వైపునకు దారి తీస్తుందని విద్యార్థులకు సూచించారు. అరోరా కళాశాల కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గుణాత్మకమైన విద్యకు కట్టుబడి ఎంబీఏ, ఎంసీఏ వంటి ప్రోగ్రామ్‌లను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో సహాయం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఆర్ఐ సీనియర్ శాస్త్ర వేత్త తన్వి అరోరా, కళాశాల వైస్ చైర్మన్ అనుదీప్ అరోరా, పంజగుట్ట ప్రిన్సిపాల్ డాక్టర్ సుష్మా చౌదరి, కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ప్రదోష్ చంద్రపట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టోలిచౌకి, ఎండిలైన్స్, టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..పనులు సకాలంలో పూర్తి కాకపోతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఎండిలైన్స్ నుంచి మోతీదర్వాజ వరకు జరుగుతున్న పనులు నత్తనడకన సాగుతున్నాయని అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పనులు సకాలంలో పూర్తి కావడం లేదని ఆయన అన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ..

హకీంపేట్ ఎస్ఎస్ గార్డెన్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు పథకాలతో నిరుపేదలకు తమ ఆడపిల్లల పెళ్లిళ్ల సందర్భంగా ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులు బాగా తగ్గాయన్నారు. ఇంకా ఎన్నో దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సరైన ధ్రువపత్రాలు జత చేయకపోవడం వల్లే అవి ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నగర సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు

గోల్కొండ: శాంతిభద్రత పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గోల్కొండ డివిజన్ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరంలో జరుగుతున్న వివిధ వర్గాల పండుగలు శాంతియుతంగా పూర్తయిన సందర్భంగా వారు సీపీని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఎటువంటి ఆటంకాలు లేకుండా వివిధ వర్గాల వారికి ర్యాలీలు, ఉత్సవాలు నిర్వహించుకోవడానికి శరతులతో కూడిన అనుమతులు ఇచ్చామన్నారు. ర్యాలీలు, వేడుకల నిర్వాహకులు తమ సూచనలను పాటించారన్నారు. స్థానికంగా జరిగే పండుగల సందర్భంగా పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు అండగా ఉంటూ ప్రతి ఉత్సవం శాంతియుతంగా జరిగేలా చూశారన్నారు. ఆయనను కలిసిన వారిలో ఆబీద్, ఆజామ్‌ఖాన్, తహసీన్‌పాషా, నర్సింగ్ తదితరులున్నారు.

విద్యార్థులకు అత్యవసర సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ దేవేందర్

యాకుత్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలు, అత్యవసర సేవలపై అవగాహన ఏర్పర్చుకోవాలని 108 అంబులెన్స్ సేవ సర్వీసుల ప్రధాన కార్యాలయ కో ఆర్డినేటర్ దేవేందర్ సూచించారు. అత్యవసర అంబులెన్స్ సేవలపై సుల్తాన్‌షాహిలోని ప్రభుత్వ శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన సభ్యులతో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన దేశంలోని 17 రాష్ట్రాల్లో 2005 నుంచి 108 అత్యవసర సేవలను ప్రారంభించి ఉచితంగా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. అత్యవసర సేవలపై అవగాహన లేకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినారాయణ, అత్యవసర సేవ సర్వీసుల సభ్యులు ప్రదీప్, పార్వతీ, ఉపాధ్యాయులు అనురుధ్‌రావు, మధుసూదన్‌రావు, డాక్టర్ విజయ్‌భాస్కర్, శ్రీదేవి, అంజలి, ప్రమీల నవనీత, శివప్రసాద్, రజిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన పార్కుల ఏర్పాటుకు చర్యలు



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రికరించి నూతన హంగులతో ఆహ్లాదకరమైన పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. రెయిన్‌బజార్ ఎస్ఆర్టీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ పార్కును ఆదివారం సాయంత్రం కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానికుల సౌకర్యార్థం దరబ్‌జంగ్ కాలనీ, బడాబజార్, రెయిన్‌బజార్ ప్రాంతాల్లో నూతన పార్కులను ఏర్పాటు చేశామన్నారు. అందరికి ఉపయోగకరంగా ఉండే విధంగా వాకింగ్ ట్రాక్, ఆరోగ్యకరమైన వాతావరణం అందించే మొక్కలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న సమితి ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సమితి ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కడ్లి రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కోఠిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా ఎదగాలంటే కులగణన సమయంలో తాము వీరశైవ లింగాయత్ కులానికి చెందిన వారమని, బలిజా అని, లింగాయత్ అని లేక ఇంకా వేరే పేర్లు చెప్పకూడదని సూచించారు. వీరశైవ లింగాయత్‌లను ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా పిలుస్తారని, కొన్ని ప్రాంతాల్లో లింగాయత్‌లను బలిజ, వాణి అని పిలుస్తారని, అలా కాకుండా కులగణన చేసే అధికారులకు వీరశైవ లింగాయత్‌లని చెప్పాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం వీరశైవ లింగాయత్‌లకు రాష్ట్ర కార్పొరేషన్లకు చైర్మన్‌గా నియమిస్తే సముచితంగా గౌరవించినట్లు అవుతుందన్నారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు దిగంబర్‌రావు, రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు సిద్ధేశ్వర్, నర్సిములు, శ్రీశైలం, నీలప్ప, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం.. పరమ పవిత్రం

- తొలి సోమవారం ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఆకాశ గంగ దీపోత్సవ వేడుకల్లో కట్టా నాగేందర్ ముదిరాజ్



ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో..

నాంపల్లి: ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో వెలసిన హనుమాన్ ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారం పూజలు వైభవోపేతంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం జరిగిన ప్రదోష పూజలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. శివలింగానికి పంచామృత అభిషేకాలు చేశారు. దీపారాధన చేసి సామూహిక శివ పంచాక్షరి స్తోత్ర పారాయణం చేశారు. ఈ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు కాసుల శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో జరిగాయి.

గుడిమల్కాపూర్‌లో..

అబిడ్స్: కార్తీక మాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. గోషామహల్, శంకర్‌బాగ్, ఆసిఫ్‌నగర్, ఆగాపురా, గుడిమల్కాపూర్ శివాలయాల్లో పెద్ద ఎత్తున కార్తీక మాసం సందడి నెలకొంది. సాయంత్రం గుడిమల్కాపూర్ శివాలయంలో ఆకాశగంగ దీపాలంకరణ, పల్లకీ సేవా నిర్వహించారు.

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయంలో సోమవారం నూతనంగా ప్రతిష్ఠింపబడిన శివలింగానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత సూచనల మేరకు సోమవారం సుంకరి శాలిని, ప్రేమ్‌కిశోర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజారి అభినందన్ ద్వివేదీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో సోమారపు జనార్దన్, ఎం.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న సుంకరి శాలిని, ప్రేమ్‌కిశోర్



గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర శివాలయంలో..

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం నృత్య దయ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు జయశ్రీ రాజగోపాలన్ శిష్యురాలు డి.విశిష్ట భరత నాట్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. వర్ణం, రామాయనంలోని పలు ఘట్టాలను చక్కటి హావాభావాలతో ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సికా అధ్యక్షుడు చక్రవర్తి, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికల అదృశ్యం



నస్రీన్ పర్వీన్



అల్ఫియా ఫాతిమా

గౌలిపురా: ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ జిలానీ కూతురు నస్రీన్ పర్వీన్ (14) పదో తరగతి చదువుతుంది. ఇటీవల జ్వరం రావడంతో ఇంట్లో ఉండి కోలుకుంది. తాను స్కూల్ వెళ్లకపోవడంతో హోమ్‌వర్క్‌ను చేసుకునేందుకు తన స్నేహితురాలు ఆల్ఫియా ఫాతిమా ఇంటికి వెళుతున్నానని ఈ నెల 3న సాయంత్రం 5 గంటలకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కాగా తలాబ్‌కట్టాకు చెందిన మహ్మద్ సలావుద్దీన్, గౌసియా ఫాతిమాల కూతురు అల్ఫియా ఫాతిమా (14) తన స్నేహితురాలు నస్రీన్ పర్వీన్ వద్దకు వెళుతున్నానని ఈ నెల 3న సాయంత్రం 5:30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. కాగా ఇద్దరూ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన ఇరువురు కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తాగుతున్న వ్యక్తికి జైలు



మీర్జా అమీర్ బేగ్ అన్సార్

గౌలిపురా: గంజాయి తాగుతున్న ఓ వ్యక్తికి జైలు శిక్ష పడిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా మురాద్ మహల్ రోడ్డు ప్రాంతానికి చెందిన మీర్జా అమీర్ బేగ్ అన్సార్ (22) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అమీర్ బేగ్‌పై కేసు నమోదు చేసుకొని సోమవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వాటర్‌బోర్డులో ఈఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి



అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు ప్రాణ సంకటంగా మారిన ఏఎంఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు పలుసార్లు మెమోరాండం అందజేసి ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్, ఇతర పలువురు నాయకులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానం ద్వారా జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ చేయాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేసి గతంలో ఉన్న ఓపెన్ టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద చిన్నాచితక కాంట్రాక్టర్లకు ఏఎంఎస్ విధానం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా కొనసాగిస్తారని ఆయన ప్రశ్నించారు.

7 నుంచి హిందూ ఆధ్యాత్మిక సేవా మేళా



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: హిందూ ఆధ్యాత్మిక సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నాలుగు రోజుల పాటు హిందూ ఆధ్యాత్మిక సేవా మేళాను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 7వ తేదీ నుంచి జరిగే ఈ మేళాకు మంత్రి శ్రీధర్‌బాబు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వి.సుబ్రమాణ్యంలతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. పాఠశాలకు వెళ్లే పిల్లలలో మానవీయ విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు సుమారు 5 వేల మంది విద్యార్థులు ఈ మేళాకు హాజరవుతారని 120కి పైగా ఆధ్యాత్మిక సమాజ సేవా సంస్థలు సేవల గురించి సమాచారాన్ని ప్రదర్శిస్తాయని తెలిపారు. 10వ తేదీన పరమవీర్ చక్ర అవార్డు గ్రహీత మేజర్ యోగేంద్రయాదవ్ పరమ వీర్ వందన్ కార్యక్రమంలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రామ్మూర్తి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి విక్రమ్ సింహా, సభ్యులు ఎన్.పద్మజ, ఆర్.రామ్‌రెడ్డి, వి.సురేష్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్ల కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి

దబీర్‌పురా: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 30 మంది రౌడీషీటర్లకు సోమవారం ఆల్ హుస్నా ఫంక్షన్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఎస్సైలు నర్సింహ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేసే వారికి గుర్తింపు



మహ్మద్ ఇస్మాయిల్‌కు మెమెంటో అందిస్తున్న నేమ్‌సింగ్

గోల్కొండ: సమాజ సేవ చేసే వారికి ప్రజలు గుర్తించడమే కాకుండా గౌరవం కూడా ఇస్తారని ఇంటర్నేషనల్ హ్యూమెన్‌రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ చైర్మన్ నేమ్‌సింగ్ అన్నారు. 18 ఏళ్లుగా నిరుపేదలకు వివిధ రకాల సేవలు అందిస్తున్న మహ్మద్ ఇస్మాయిల్‌కు సోమవారం ఆయన టోలిచౌకీలోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణ కోసం తమ సంస్థ మూడు దశాబ్దాలుగా క్రియాశీలకంగా పని చేస్తుందన్నారు. తెలంగాణలో తమ సంస్థ తరఫున మహ్మద్ నజీబ్ ప్రోత్సాహంతో మహ్మద్ ఇస్మాయిల్ సమాజ సేవలో చురుకుగా వ్యవహరిస్తున్నారన్నారు.

అధ్వానంగా బుల్కాపూర్ నాలా



రింగ్ రోడ్ మొగల్‌నగర్‌లోని నాలా

గోల్కొండ: నాలాల నిర్వహణపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీంతో కార్వాన్ నియోజకవర్గంలోని నాలాలు అధ్వానంగా తయారయ్యాయి. హకీంపేట్‌లోని బుల్కాపూర్ నాలా పరిసర ప్రాంతాల వారికి శాపంగా మారింది. చిన్న వర్షం కురిసినా బుల్కాపూర్ నాలా పొంగి పొర్లుతుంది. ఈ నాలాలో పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో నాలాలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ కారణంగా నాలాలోని నీరు ముందుకు కదలడం లేదు. నాలాలోని వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతుండగా నాలాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. అదే విధంగా కార్వాన్ మొగల్‌నగర్‌లోని నాలా సైతం పూర్తిగా అధ్వానంగా మారింది. రింగ్ రోడ్ నుంచి కార్వాన్ వైపు వెళ్లే రోడ్డు నుంచి ప్రవహిస్తున్న మొగల్ కా నాలా పరిసర ప్రాంతాల వారికి దుర్గంధాన్ని వ్యాపింపజేస్తుంది. రోడ్డుకు వేసిన కల్వర్టు కింద నుంచి నాలా ప్రవహిస్తుండగా రోడ్డుకు ఇరువైపులా అధికారులు నాలాకు పెన్సింగ్ వేసి చేతులు దులుపుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ 11కేవీ ఫీడర్ల మరమ్మతులు కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. లంగర్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని లంగర్‌హౌస్ క్రాస్ రోడ్, పెన్షన్ పురా, గోల్ల బస్తీ, బగ్దాల్ కాలనీ, అమ్మద్ కాలనీ, ఇంద్రానగర్, ఫ్లోర్ మిల్, మిలట్రీ దావఖానా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. లంగర్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫతేదర్వాజా 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఫతేదర్వాజా, చోటా బజార్, మ్యూజియం, పోస్ట్ ఆఫీస్, క్లాత్ గల్లీ, బడాబజార్, దాన్‌కోట, సాలేనగర్ కంచ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. మోతీమహల్ సబ్‌స్టేసన్ కంపెనీ బాగ్ 11 కేవీ ఫీడర్ సాంగ్రీల్లా స్కూల్, మోతీదర్వాజా, అఫ్సర్ కాలనీ, అహ్మద్ కాలనీ, కంపెనీ బాగ్, బగ్దాత్ కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గంగానగర్, రాంసింగ్‌పురా పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గంగానగర్, రాంసింగ్‌పురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కమేళాగేట్, గంగానగర్, సన హోటల్, ఆర్య సమాజ్, ఎంసీహెచ్ పార్క్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాలలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ధూల్‌పేట్, ఓవర్ హెడ్, ఇసామియాబజార్, సీబీఐ ఫీడర్ల పరిధిలోని మంగళ్‌హాట్, అమర్‌నగర్ కాలనీ, ఇసామియాబజార్, గుజరాతీ గల్లి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆంధ్ర బ్యాంక్ చౌరస్తా, సీబీఐ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

యాదవ కులస్తులకు అండగా ప్రభుత్వం



బజ్జు గోప్ యాదవ్

అఫ్జల్‌గంజ్: సదర్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం ఎంతో గర్వకారణమని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర యాదవ మహాసభ నాయకులు బజ్జు గోప్ యాదవ్ పేర్కొన్నారు. గత పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని యాదవ కులస్తులు పలుసార్లు అడిగినా మాజీ సీఎం కేసీఆర్ యాదవుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. యాదవ కులస్తులు విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి దీపావళి వేడుకల సందర్భంగా నిర్వహించే యాదవుల సదర్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించడంతో లక్షలాది మంది యాదవులంతా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. యాదవ కులస్తులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే యాదవ కులస్తులకు న్యాయం జరిగిందన్నారు. దీర్ఘకాలంగా ఉన్న యాదవ కులస్తుల కలను సహకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



సందీప్

గన్‌ఫౌండ్రీ: చెన్నైలో జరుగనున్న 14వ సీనియర్ పురుషుల విభాగం జాతీయ హాకీ చాంపియన్‌షిప్ పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారులు రాణించాలని తెలంగాణ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం హాకీ టీమ్ క్రీడాకారులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం టీమ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీమ్ కోచ్ కిరణ్‌కుమార్, కెప్టెన్ సందీప్, మేనేజర్ ప్రదీప్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి మృతి



జానకీరామ్

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి, సంఘ సేవకుడు, గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ ఆలయ సలహాదారుడు బుజ్జం జానకీరామ్ (83) సోమవారం మృతి చెందారు. జానకీరామ్ మృతి పాతబస్తీకి తీరని లోటని నాయకులు కొనియాడారు. ఆయన అంత్యక్రియలను సోమవారం చాంద్రాయణగుట్ట నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ చైర్మన్ రాకేశ్ తివారీ, పాతనగర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొని సంతాపం ప్రకటించారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న బీసీ కులగణనలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను కులంగా కాకుండా వృత్తులుగా పేర్కొనడం పట్ల తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను వంచనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన కులగణన ఫార్మెట్‌లో జరిగిన పొరపాటును వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. సాంప్రదాయ వృత్తులైన కమ్మరి, వడ్రంగి, ఇత్తడి, శిల్పి, స్వర్ణకార వృత్తులను నిర్వహిస్తున్న వారందరినీ ఒకే జాతులుగా గుర్తించాలని కోరారు. పొరపాట్లను సరిదిద్దకుండా కుల గణన జరిపితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాల్‌కోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ



గోల్కొండ: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువ గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం సయ్యద్ ఫయాజ్ గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులుతో కలిసి దివ్యాంగుడైన జాహేద్ ఆలీ సోదరి వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుడైన జాహేద్ ఆలీ స్వయం కృషితో కుటుంబాన్ని పోషిస్తున్నారన్నారు. ఇటువంటి దివ్యాంగులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.